క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం



సంగం/దగదర్తి: సంగం, దగదర్తిలోని వెంకయ్యస్వామి మందిరాల్లో ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంగంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. దగదర్తిలో పల్లకిసేవ, గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సురవరం మృతి తీరని లోటు

జలదంకి: సీపీఐ జాతీయ నేత సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని లోక్‌సత్తా నేత మాలకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సంతాపాన్ని ప్రకటించారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, లోక్‌సభ సభ్యుడిగా రెండుసార్లు పనిచేసిన ఆయన దేశ వ్యాప్తంగా పేదలు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. నేటి యువత సురవరం సుధాకర్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని దేశ ప్రగతికి, ప్రజాస్వామ్య విలువల కోసం కృషి చేయాలని కోరారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలని విజ్ఞప్తి

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం మార్గంలో ఆర్టీసీ స్టూడెంట్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలో గండిపాళెం మార్గంలో ఉదయం 8.30 గంటలకు ఉదయగిరి నుంచి గండిపాళెం వరకు స్టూడెంట్ బస్సు సర్వీసు ఉండేది. దీంతో ఎస్వీ చింతల, గుడినరవ, కొత్తపల్లి, జీ కొండారెడ్డిపల్లి, వెంగళరావునగర్ గ్రామాలకు చెందిన 60 మంది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేది. కానీ ఇటీవల స్త్రీశక్తి పథకాన్ని అమలు చేయడంతో ఈ సర్వీసును రద్దు చేసి వేరే ప్రాంతాలకు నడుపుతున్నారు. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి స్టూడెంట్ సర్వీసును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే చర్యలు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా గ్రావెల్, మట్టి తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ వెంకట్రావు హెచ్చరించారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో టిప్పర్లు, ట్రాక్టర్లు, జేసీబీల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రావెల్, మట్టి తరలించే వారు సంబంధిత అధికారుల వద్ద అనుమతులు తీసుకుని వాటిని ముందుగా పోలీసులకు ఇవ్వాలన్నారు. అనుమతులు ఉన్న వారు కూడా ఉదయం నుంచి సాయంత్రంలోపు మాత్రమే తరలించాలన్నారు. రాత్రి వేళల్లో రవాణా చేయకూడదన్నారు. నిబంధలను అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమాశంలో ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాల కోసం కూలీల ఎదురుచూపులు

దగదర్తి: మండలంలోని ఉపాధి కూలీలు మూడు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని 20 పంచాయతీల్లో సుమారు పదివేల మందికిపైగా కూలీలకు దాదాపు రూ.1.40 కోట్ల మేర వేతనాలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం పది పంచాయతీల్లో మాత్రమే ఉపాధి పనులు జరుగుతున్నాయి. మిగిలిన పంచాయతీల్లో పెండింగ్ వేతనాలు చెల్లిస్తేనే పనికి వస్తామని కూలీలు తెగేసి చెప్పడంతో చేసేదేమీ లేక ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు నిలిపివేశారు.

బ్రిడ్జిపై గుంతలకు మరమ్మతులు



వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ పరిధిలోని భోగ్యంవారిపల్లి వద్ద 565 నంబర్ జాతీయ రహదారి బ్రిడ్జి పైభాగంలో ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టారు. బ్రిడ్జి పైభాగంలో కాంక్రీట్ లేచిపోయి ఇనుప చువ్వలు బయటపడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై ఇటీవల 'సాక్షి'లో 'ప్రమాదభరితంగా బ్రిడ్జి' శీర్షికన కథనం రావడంతో నేషనల్ హైవే అధికారులు స్పందించారు. గుంతలకు మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోట్లు వెచ్చించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు



నిరుపయోగంగా మారిన మదర్ వాటర్ ప్లాంట్

- మూలకు చేరిన మదర్ వాటర్ ప్లాంట్
- తుప్పు పడుతున్న ట్యాంకర్లు, ట్రాక్టర్లు
- చోరీకి గురవుతున్న ట్రాక్టర్ల సామగ్రి
- ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు అందని శుద్ధి జలాలు



కంపచెట్లలో విలువైన ట్రాక్టర్లు

కొండాపురం : మండలంలోని ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు శుద్ధి జలాలను అందించే లక్ష్యంతో కొండాపురంలో ఏర్పాటు చేసిన మదర్ వాటర్ ప్లాంట్ మూలకు చేరింది. అందుకు సంబంధించిన ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు తుప్పు పట్టి శిథిలమవుతున్నాయి. విలువైన ట్రాక్టర్ టైర్లు, ఇతర సామగ్రి చోరీకి గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురాడంపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.15కోట్ల ఖర్చుతో..

మండలంలోని ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు మినరల్ వాటర్‌ను అందించే లక్ష్యంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద రూ.15కోట్లను మంజూరు చేసింది. కొండాపురంలో మదర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శుద్ధి జలాలను ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లోని మినీ వాటర్ ట్యాంకుల్లో నింపి అందించాలని నిర్ణయించింది. ఈ పనులు దక్కించుకున్న టీడీపీ నాయకులు మదర్‌ప్లాంట్ పనులు పూర్తి చేశారు. గ్రామాల్లో మినీట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. గ్రామాలకు మినరల్ వాటర్‌ను తరలించేందుకు ట్రాక్టర్లు, ట్యాంకర్లను కొనుగోలు చేశారు. అనంతరం ఏమైందో ఏమో కానీ అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్నికల పేరుతో పనులను నిలిపివేసింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చొరవచూపి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పథకాన్ని పునరుద్ధరింపజేశారు. అనంతరం కొన్నినెలల పాటు వైఎస్సార్ సుజల స్రవంతి పేరుతో మినరల్ వాటర్‌ను గ్రామాలకు తరలించే లక్ష్యం కొనసాగింది. ఆ తరువాత ఎన్నికలు రావడం..మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పథకం మూలకు చేరింది. దీంతో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల ప్రజలు తాగునీటిని కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి నెలకొంది.

తుప్పు పడుతున్న ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకులు



తుప్పపడుతున్న వాటర్ ట్యాంకులు

ప్రస్తుతం కొండాపురంలోని మదర్ ప్లాంట్ వద్ద లక్షలాది రూపాయల విలువైన 26 ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకులు ఉన్నాయి. కొండాపురంలోని నాలుగు ట్రాక్టర్లు ఉండగా, వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాలకు సంబంధించిన 22 ట్రాక్టర్లను సైతం ఇక్కడకే చేర్చారు. అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. ట్రాక్టర్ల టైర్లు, ఇతర విలువైన సామగ్రి చోరీకి గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా మంచినీటి పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి నిరుపయోగంగా వదిలేయడంపై మండిపడుతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పథకాన్ని పునఃప్రారంభించి శుద్ధి జలాలను అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



సోమశిల: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య డిమాండ్ చేశారు. రైతు సంఘం అనంతసాగరం మండల మూడో మహాసభను ఆదివారం నిర్వహించారు. అనంతసాగరంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో నిర్వహించిన మహాసభకు మూలి వెంగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఎడగారు వరి కోతలు మొదలైనా ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు యూరియాను అందించడంలో, వారి సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతాంగం ఐక్యంగా ఉద్యమాలు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కోసం పోరాటం చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా అల్లంపాటి నరసింహరెడ్డి, కార్యదర్శిగా సత్తార్, సభ్యులను ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు ప్రసాద్, సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్ బాషా, రైతు సంఘ నాయకులు గాడి సుధాకర్, ఉప్పలపాడు మస్తాన్, తిరుపతినాయుడు, సుబ్బారెడ్డి, మల్లెం కొండయ్య, రాజయ్య, నరసింహులు పాల్గొన్నారు.

అవలక్షణాలతో మానవ జీవితం వినాశనం



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

ఆత్మకూరు: అసహనం, కోపం, ప్రతీకారం, తదితర అవలక్షణాలు ఉంటే మానవ జీవితం వినాశనం అవుతుందని తెలుగు భారతి సేవా సమితి ఉపాధ్యక్షుడు అచ్చోలు నరసింహారెడ్డి పేర్కొన్నారు. తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహించే మంచిమాట కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషి తన జీవితాన్ని సార్థకం చేసుకునేందుకు మంచి పనులు చేయాలన్నారు. మానవులకు అవలక్షణాలు సంక్రమిస్తే జరిగే నష్టాలను ఆయన వివరించారు. సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం, తోటి మానవులకు సాయం చేయడం, మంచి లక్షణాలు, సత్యం, ధైర్యం, త్యాగం, భక్తి వంటివి మనిషిని సమాజంలో ఉన్నతుడిగా నిలబెడతాయన్నారు. సేవా సమితి అధ్యక్షుడు ఎస్ సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి, కవి అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి, అంకినపల్లి గోవిందరెడ్డి, కొల్లా వెంకటేశ్వర్లు, యానాదిరెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, రామయ్యస్వామి, కే రవీంద్రకుమార్, వెంకయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహ నిర్మాణాలు వేగవంతం



దుత్తలూరులోని స్టాక్ పాయింట్‌లో చువ్వను పరిశీలిస్తున్న పీడీ వేణుగోపాల్

ఉదయగిరి: జిల్లాలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న పక్కాగృహాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హౌసింగ్ పీడీ వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపల్లిలోని జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను ఆదివారం ఆయన పరిశీలించారు. త్వరగా పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని లబ్ధిదారులకు తెలిపారు. అనంతరం ఉదయగిరి హౌసింగ్ గోదాములో సిమెంట్, ఐరన్ స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. ఇటీవల దుత్తలూరులోని గోదాము నుంచి ఐరన్‌ను దొంగతనంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న నేపథ్యంలో పీడీ రికార్డులను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. నాలుగు టన్నుల ఐరన్ వ్యత్యాసం ఉండడాన్ని గుర్తించారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీఈ ఫిరాన్, ఏఈలు సిబ్బంది ఉన్నారు.

కొత్తగా రోడ్డు వేశారు.. పాతరోడ్డును వదిలేశారు



డీసీపల్లి అలుగు వద్ద దెబ్బతిన్న సిమెంటు రోడ్డు



ఉత్తర కాలువ వంతెనపై నిలిచిన వర్షపునీరు(ఫైల్)

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లి నుంచి వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు పీఎంజీఎస్‌వై నిధులతో కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఈ మార్గంలోని పాత సీసీరోడ్డు, వంతెనలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరువైపులా కొత్తగా రోడ్డు నిర్మించడంతో ఉత్తరకాలువ వంతెనపై వర్షం పడితే నీరు నిలిచిపోతోంది. అలాగే ఈ మార్గంలోనే డీసీపల్లి చెరువుకట్ట ప్రారంభం నుంచి పెద్ద అలుగు చివరి వరకు పదేళ్ల క్రితం నిర్మించిన సిమెంట్ రోడ్డు పగిలిపోయి ప్రమాదభరితంగా ఉంది. ఈ దెబ్బతిన్న ప్రాంతాన్ని పంచాయతీరాజ్ శాఖ ప్రాజెక్ట్ విభాగం అధికారులు కొత్త రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించే పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో మిగతా మార్గం మొత్తం ప్రయాణం వాహనదారులకు సులువుగా ఉండగా ఈ రెండు ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఆత్మకూరు పీఆర్ ప్రాజెక్ట్ విభాగం డీఈ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా ఉత్తర కాలువపై వంతెన తమ పరిధిలోనిది కానందున తాము ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదన్నారు. డీసీపల్లి అలుగు ప్రాంతంలో సిమెంట్ రోడ్డు దెబ్బతిన్న మాట వాస్తవమే అయినా అంచనాల సమయంలో దాన్ని వదిలేయడంతో మరమ్మతులు చేపట్టలేని పరిస్థితులు ఏర్పడిందన్నారు.

నల్లగొండ్ల క్షేత్రం చైర్‌పర్సన్‌గా కాంతమ్మ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నూతన పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ చైర్‌పర్సన్‌గా లెక్కల కాంతమ్మ, సభ్యులుగా బొల్లా వెంకట గోపికృష్ణ, ఆకలి రవిప్రసాద్, అంకినపల్లి నరసింహులు, మీసాల నరసమ్మ, భోగిరెడ్డి శార్వాణి, చెంచల సుభాషిణి, పొన్నూరు అంకమ్మ, చిరువెల్ల మహేష్ నియమితులయ్యారు. ఈ నెల 29న నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం చేయనుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ఉదయగిరి: మండలంలోని దాసరిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. దుత్తలూరు మండలం సోమలరేగడకు చెందిన నారాయణరెడ్డి ఉదయగిరి నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో దాసరిపల్లి సమీపంలో ఒక్కసారిగా గేదె అడ్డురాగా దానిని ఢీకొని కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గేదె మృతి చెందింది. క్షతగాత్రుడ్ని 108 వాహన సిబ్బంది ఉదయగిరి సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీలో మెరిసిన ఆత్మకూరువాసి



ఆత్మకూరు: పట్టణానికి చెందిన కే దినేష్ డీఎస్సీ–2025 ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో జిల్లాలో 2వ ర్యాంకు సాధించాడు. పట్టణంలోని సబ్‌కోర్టులో విధులు నిర్వహిస్తున్న వెంకట సుబ్బయ్య, పద్మావతి దంపతుల కుమారుడు దినేష్ తొలి ప్రయత్నంలో మంచి ర్యాంకు సాధించడంపై జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్ కుమార్, అభినందించారు.

పొదుపు సభ్యులపై వెలుగు సీసీ దురుసు ప్రవర్తన

వింజమూరు(ఉదయగిరి): తమపై వెలుగు సీసీ సుశీల దురుసుగా ప్రవర్తించినట్లుగా వింజమూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన పొదుపు సభ్యులు ఎంపీడీఓ ఆంజనేయులకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు..ఊటుకూరు గ్రామానికి చెందిన పొదుపు సభ్యులకు వెలుగు సీసీ విజయలక్ష్మి మూడు నెలల క్రితం ఉన్నతి లోన్లు మంజూరు చేస్తామని తెలిపారు. దీంతో బెంగళూరులో కూలి పనులు చేసుకుంటున్న కొంతమంది సభ్యులు హుటాహుటిని ఇంటికి వచ్చి సీసీని కలిశారు. మీకు ఉన్నతి లోన్లు మంజూరు చేశామని, వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని, ఇందుకు ప్రతి సభ్యురాలు రూ.2వేలు నగదు ఇవ్వాలని సీసీ కోరారు. అయితే తాము రూ.1500 ఇస్తామని చెప్పగా, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారని పొదుపు సభ్యులు ఆరోపించారు. లోన్లు మంజూరైన వెంటనే ఇస్తామని చెప్పగా సీసీ ఆగ్రహంతో మళ్లీ రమ్మని పంపారని చెప్పారు. మూడు నెలలు గడిచినా లోన్ నగదు ఖాతాల్లో జమ కాలేదన్నారు. తమ వద్ద వేలిముద్రలు, సంతకాలు చేయించుకుని మూడు నెలలు గడిచినా లోన్లు మంజూరు కాకపోవడంపై సీసీని ప్రశ్నించగా అసభ్యపదజాలంతో దూషించారని వారు వాపోయారు. ఇలా ప్రతిలోన్లకు సీసీ నగదు వసూలు చేస్తోందని ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీఓకు శనివారం ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. స్పందించిన ఎంపీడీఓ సోమవారం సీసీని విచారించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. కాగా గతంలో మండలంలో పనిచేసిన సమయంలో కూడా ఉన్నతి లోన్లకు సంబంధించి లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేసి స్వాహా చేశారనే ఆరోపణలు సీసీపై ఉన్నాయి.

యువకుడి అరెస్ట్

ఉదయగిరి రూరల్: మండలంలోని జీ చెరువుపల్లి పంచాయతీ వడ్డిపాళేనికి చెందిన బత్తుల శివప్రియ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ప్రమేయం ఉన్న వల్లెపు హరికృష్ణను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ ఏడాది మే 29న హరికృష్ణ ప్రేమించి మోసం చేశాడంటూ ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో శివప్రియ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం అప్పట్లో సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు హరికృష్ణ కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు హరికృష్ణను అరెస్ట్ చేశారు.

స్మార్ట్ మీటర్లపై ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకులు

దగదర్తి: ప్రభుత్వం వినియోగదారులకు అభీష్టానికి వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్లను బిగించాలని చూస్తే ఉద్యమిస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు, ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్ హెచ్చరించారు. మండలంలోని నారాయణపురంలో ఏపీ రైతు సంఘం ఐదో మండల మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగులగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు వాటిని బిగించి ప్రజలపై భారం మోపాలని చూడడం దారుణమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, దగదర్తి– ముంగమూరు కాలువ పనులు పూర్తి చేసి మొదటి పంటకు నీరందించాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గొల్లపల్లి వెంకటరమణ, కార్యదర్శిగా గోపసాని రమేష్, కమిటీ సభ్యులుగా చల్ల మాల్యాద్రి, పెరికల మాల్యాద్రి, గోపసాని రవి, బత్తల శ్రీనివాసులు, రామిశెట్టి శ్రీనివాసులు, గొల్లపల్లి మల్లికార్జున, షేక్ కాలేషాను ఎన్నుకున్నారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఏ క్షణాన కూలుతుందో..



శ్లాబ్ పెచ్చులు ఊడి బయటపడ్డ కమ్ములు



దెబ్బతిన్న కాంక్రీట్ పిల్లర్

దగదర్తి : మండల తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. సుమారు 34 ఏళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. గతంలో శ్లాబు దెబ్బతిని పెచ్చులూడగా మరమ్మతులు చేయించారు. అప్పట్లో మరమ్మతులు చేపట్టిన కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా పనులు చేపట్టారు. ప్రస్తుతం మళ్లీ శ్లాబ్ దెబ్బతిని పెచ్చులూడి పడుతున్నాయి. కాంక్రీట్ పిల్లర్లు సైతం దెబ్బతిని కమ్ములు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఏ క్షణాన కూలుతుందోనని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనం శ్లాబ్ నాణ్యతను పరిశీలించి నూతన భవనాన్ని మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



ఉదయగిరి: ఉదయగిరి సర్కిల్ పరిధిలో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి ఉదయగిరి సీఐ వెంకట్రావు తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తోందన్నారు. ఉత్సవ కమిటీలు ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అనుమతులు లేకుండా ఉత్సవాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డీజే, అశ్లీల నృత్యాల ప్రదర్శనకు అనుమతి లేదన్నారు. ఉత్సవాలు పూర్తయ్యే వారకు ఉత్సవ కమిటీలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

కాలువల్లో ఇసుక మేటలు.. సాగని సాగునీరు



అన్న, పెద్దిరెడ్డి కాలువల తూముల వద్ద మేటలు వేసిన ఇసుక



అన్న కాలువలో పేరుకున్న ఇసుక

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పుపాలాలకు సాగునీరు అందించే పంట కాలువల్లో ఇసుక మేటలు వేయడంతో సాగునీరు సజావుగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది సోమశిల జలాశయం నుంచి సాగునీరు అందించడంతో ఆత్మకూరు చెరువు పరిధిలోని ఆయకట్టు రైతులు రెండో పంట సాగుచేశారు. అయితే తూర్పుపాలాలకు చెరువు నీటికి తోడు గతంలో కసుపూరుపల్లి వద్ద పెన్నానదిలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం ద్వారా కూడా సాగునీరు అందుతుంది. అయితే పెన్నానదిలోని ఇసుక పంపింగ్ స్కీం నీటి ద్వారా సాగునీటి కాలువల్లోకి చేరి మేటలు వేయడంతో సాగునీరు సజావుగా ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా అన్న కాలువ, పెద్దిరెడ్డి కాలువలో ఇసుక మేటలు వేయడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ఇసుక మేటలను తొలగించి సాగునీరు సజావుగా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్

ఉదయగిరి: మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ ఎల్ రామ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, రేషన్ డీలర్లకు స్మార్ట్ కార్డుల పంపిణీపై అవగాహన కల్పించారు. మండలంలో 10,674 కార్డులు ఉండగా ,ప్రస్తుతం 10,382 స్మార్ట్‌కార్డులు వచ్చాయని తెలిపారు. సచివాలయ సిబ్బంది, డీలర్లు రేషన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీటీ షాజియా, వీఆర్వోలు పాల్గొన్నారు.